
కామారెడ్డిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీఎన్‌జీవోస్ నాయకులు


బిచ్కుందలో నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్(టీఎస్) నాయకులు


నస్రుల్లాబాద్‌లో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


బీబీపేట్ మండలం జనగామలో


కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో..


బాన్సువాడ మండలం బోర్లంలో..


జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..


బాన్సువాడ పట్టణంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి స్థానిక నాయకులు

## బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఏప్రిల్ 5: జిల్లా వ్యాప్తంగా తొలి ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువులు వక్తలు మాట్లాడుతూ.. దేశానికి ఆయన అందించిన సేవలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషిని కొనియాడారు. కామారెడ్డిలోని జిల్లా కార్యాలయాల సమీకృత భవనంలో ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ జితేశ్‌వీ పాటిల్, అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా అధికారులు పాల్గొని నివాళులర్పించారు.

**జగ్జీవన్‌రామ్ గొప్ప సంఘ సంస్కర్త: పోచారం**

బాన్సువాడ పట్టణంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం, చిత్రపటానికి మాజీ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగ్జీవన్‌రామ్ గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. అంటరానితనం, కుల వివక్ష నిర్మూలనతోపాటు బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పోరాటాలు చేశారని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పోచారం పిలుపునిచ్చారు.


నిజాంసాగర్ మండలం మాగి గ్రామంలో..


పిట్లం మండలం కుర్తి గ్రామంలో..

## హోరాహోరీగా కుస్తీ పోటీలు


కుస్తీ పడుతున్న మల్లయోధులు

బాన్సువాడ రూరల్, ఏప్రిల్ 5: మండలంలోని కొల్లూరులో గ్రామదేవతల జాతరను పురస్కరించుకొని శుక్రవారం నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. పోటీల్లో పాల్గొనేందుకు చుట్టుపక్కల గ్రామాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి మల్లయోధులు తరలివచ్చారు. చివరి కుస్తీలో గోపాల్ విజేతగా నిలువగా, గ్రామ పెద్దలు రూ. 2వేల నగదు బహుమతిని అందజేశారు. గ్రామపెద్దలు బాపురెడ్డి, ప్రమోదర్‌రెడ్డి, దుర్గారెడ్డి విఠల్, సాయిలుయాదవ్, జనార్దన్‌రెడ్డి, వెంకట్, సాయిలు, పోచీరాం, గంగారాం, తుకారాం, గంగారెడ్డి, బీరయ్య, బర్ల సాయిలు, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ కార్యకర్తకు ఆర్థిక సాయం


గురుమూర్తికి ఆర్థికసాయం అందజేస్తున్న జడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్

బీబీపేట్, ఏప్రిల్ 5: మండలంలోని యాడారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త వడ్ల గురుమూర్తి ఇటీవల అనారోగ్యం బారిన పడడంతో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ డబ్బులను జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్ శుక్రవారం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలమణి, ఎంపీటీసీ రవి, రైతు బంధు సమితి మండల మాజీ కన్వీనర్ నాగరాజ్‌గౌడ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నర్సింహులు, మాజీ సర్పంచ్ వెంకటేశం, ఎస్ఎంసీ మాజీ డైరెక్టర్ బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేపు మోడల్‌స్కూల్ ప్రవేశ పరీక్ష

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 5: మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షను ఈనెల 7వ తేదీన నిర్వహించనున్నట్లు ఎల్లారెడ్డి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సాయిబాబా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం పది నుంచి 12 గంటల వరకు స్థానిక మోడల్‌స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశానికి, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఏడు నుంచి పదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఆరో తరగతిలో ప్రవేశ పరీక్షకు 218, ఏడో తరగతికి 80, 8వ తరగతికి 90, తొమ్మిదో తరగతికి 60, పదో తరగతిలో ఖాళీల కోసం 13మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షకు హాజరు కావాలని సూచించారు.

## 9న నరేంద్రాచార్య మహరాజ్ పాదుకా దర్శనం


డోంగ్లీలో ఏర్పాటుచేస్తున్న మండపం

డోంగ్లీ, ఏప్రిల్ 5: డోంగ్లీలో ఈనెల 9వ తేదీన సద్గురు స్వామి నరేంద్రాచార్య మహరాజ్ పాదుకా దర్శన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందుకోసం డోంగ్లీలోని రామాలయ ఆవరణలో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమానికి సుమారు పది వేల మంది భక్తులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. ఇందుకోసం ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా నిర్వాహకులు శుక్రవారం కోరారు.

## వాహనాల తనిఖీ


కారు తనిఖీ చేస్తున్న పోలీసులు

రాజంపేట్, ఏప్రిల్ 5: ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండలంలోని బస్వన్నపల్లి శివారులో పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సంపత్ మాట్లాడుతూ.. సరైన ఆధారాలు లేకుండా రూ. 50 వేలకు మించి తరలించొద్దని సూచించారు.

## నర్సరీ పరిశీలన


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో గంగాధర్

పిట్లం, ఏప్రిల్ 5: నిజాంసాగర్ మండలంలోని జక్కాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని ఎంపీడీవో గంగాధర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీలో పెంచుతున్న మొక్కలపై నిర్లక్ష్యం వహించొద్దని, ఒక్క మొక్క కూడా ఎండిపోకుండా చూసుకోవాలని, తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి శేఖర్‌ను ఆదేశించారు.

# అనిల్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి

- **బీఆర్ఎస్ ప్రచార రథాలను ప్రారంభించిన కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్**

కామారెడ్డి, ఏప్రిల్ 5 : లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ ప్రచారం ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఐదు ప్రచార రథాలను సిద్ధం చేయగా పార్టీ కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గంపగోవర్ధన్.. పట్టణంలోని ఆయన నివాసం వద్ద శుక్రవారం ప్రారంభించారు. ఈ రథాల ద్వారా ఊరూరా ప్రచారం కొనసాగుతుందని, గాలి అనిల్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధికార ప్రతినిధి గైని శ్రీనివాస్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ పిట్ల వేణుగోపాల్, నాయకులు గెరిగంటి లక్ష్మీనారాయణ, రవితేజ, భానుప్రసాద్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.


బీఆర్ఎస్ ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గంపగోవర్ధన్

## ఇఫ్తార్‌లో పాల్గొన్న జుక్కల్ ఎమ్మెల్యే



డోంగ్లీ, ఏప్రిల్ 5: మండలంలోని మొఘ గ్రామంలో శుక్రవారం ఏర్పాటుచేసిన ఇఫ్తార్‌లో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## రైతులు అప్రమత్తంగా ఉండాలి

మాచారెడ్డి, ఏప్రిల్ 5 : కొందరు దుండగులు ముఠాలుగా ఏర్పడి పొలాల వద్ద ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఆయిల్, కాపర్ వైర్లు చోరీ చేస్తున్నారని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో సూచించారు. ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



చిన్నకొడప్‌గల్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఈవో సురేశ్, యాచారంలో విండో సీఈవో నయీం

పిట్లం/సదాశివనగర్, ఏప్రిల్ 5: రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి, మద్దతు ధర పొందాలని ఏఈవో సురేశ్ అన్నారు. చిన్నకొడప్‌గల్ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సీఈవో హన్మాండ్లు, సిబ్బంది రమేశ్, లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు. సదాశివనగర్ మండలంలోని ఉత్తునూర్ ప్రాథమిక సహకార సంఘం పరిధిలోని యాచారం గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో సీఈవో నయీం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లతా రమేశ్, ఏఈవో శిరీష, విండో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## దీక్షా స్వాములకు భిక్ష


భిక్షలో పాల్గొన్న సేవాలాల్ మాలధారులు

పిట్లం, ఏప్రిల్ 5: మండలంలోని గౌరారం తండాలో సేవాలాల్ మాలధారులకు బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీటీసీ శ్రావణ్ కలిసి శుక్రవారం భిక్ష ఏర్పాటుచేశారు. సేవాలాల్ మహరాజ్, భవానీ మాతకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, తండావాసులు, మాలధారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే హక్కులేదు


రైతు సత్యాగ్రహ దీక్ష చేస్తున్న బీజేపీ నాయకులు

కామారెడ్డి, ఏప్రిల్ 5 : అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలను ఓట్లు అడిగే హక్కు లేదని బీజేపీ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా శుక్రవారం కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తప్పుడు హామీలిచ్చి గద్దెనెక్కిందని ఆరోపించారు. కార్యక్రమంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, బీబీ పాటిల్, అరుణతార, యెండల లక్ష్మీనారాయణ, బాణాల లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, నరేందర్ రెడ్డి, రవీందర్ రావు, లక్ష్మారెడ్డి, లింగారావు తదితరులు పాల్గొన్నారు.

## మంచి కోసం కలిసి పనిచేయాలి


పూజలు నిర్వహిస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 5: మంచి కోసం కలిసి పనిచేయాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని సోమరేగడి తండాలో శుక్రవారం నిర్వహించిన సేవాఘడ్ మహాదీక్షలో ఆయన పాల్గొన్నారు. భోగ్‌బండార్‌లో పాల్గొన్న ఎల్లారెడ్డి జడ్పీటీసీ సభ్యుడు ఉషాగౌడ్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. లింగంపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సేవాలాల్ మహరాజ్ సేవలను గుర్తుచేశారు. కార్యక్రమంలో మాలధారులు గోవింద్, కార్బరి, మాలోత్ లచ్చానాయక్, లకావత్ రవి, అంగోత్ బుద్ధి శంకర్, నాయకులు సాయిబాబా, సంతోష్, గణేశ్, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి స్పందన


రోగులకు మందులను అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు

బిచ్కుంద, ఏప్రిల్ 5: మండలంలోని పెద్ద దడ్గి గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 60 ఏండ్లు పైబడిన వారిని పరీక్షించారు. బీపీ, షుగర్, 2డీ ఇకో, ఈసీజీ తదితర పరీక్షలు చేశారు. అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ బిచ్కుంద మండల చైర్మన్ కోలావార్ కుమార్, జిల్లా కోశాధికారి దస్తీరాం, డాక్టర్ విక్రమ్, డాక్టర్ శశి, డాక్టర్ ఉమాకాంత్, రచ్చ శివకాంత్, రమణ, గోపాల్, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**WANTED**

★Wanted Agents, Associates Franchise throughout Telangana for Abroad Medical College Admission. 8881116865 / 8881115253.
NT-311882-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.